# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

epaper.manachourasta.com

సంపుటి : 01 | సంచిక : 112 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం, 21 మార్చి 2026 | పేజీలు : 4




**లక్ష్యంతో చదవాలి**

జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

3 లో



## తెలంగాణ రాష్ట్ర బడ్జెట్..

# రూ.3,24,234 కోట్లు

- బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన కేబినెట్
- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026–27 తెలంగాణ బ్జడెట్‌లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు.రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు.

-హైదరాబాద్, మన చౌరాస్తా

2

## జనగామ కలెక్టరేట్‌లో..

# ఇక e-ఆఫీస్

- పేపర్ లెస్ సేవలకు శ్రీకారం చుట్టిన కలెక్టర్
- అధికారులు నిబద్ధతతో పనిచేయాలి
- పెండింగ్ ఫైల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

3 లో







# రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్

■ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్ ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బ్జడెట్ లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్ లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు.రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంటే అంకెల చుట్టూ తరిగడం కాదని, అభివృద్ధి సంఖ్యలను ఆవిష్కరించ డమని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే.. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన `ఆరు గ్యారెంటీలకు బడ్జెట్ లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లోబీమా పథకాలను చేర్చారు. ప్రతి పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు 'ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం' కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్ లో ఒక కీలక అడుగుగాభావించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందచేస్తారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం ఇస్తారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేపట్టారు.. కేటాయింపులను పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు, బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు, మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మీ పథకం.. రూ.3,683 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీ కి రూ.వెయ్యి కోట్లు, మెట్రో రైలు ఫేజ్`2.. రూ.600 కోట్లు, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పథకం.. రూ.723 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ.. రూ.1143 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్.. రూ.3500 కోట్లు, మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటయిస్తున్నట్లు భట్టి ప్రకటించారు.



# ఇది ప్రజా సంక్షేమ బడ్జెట్

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ సీఎం ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా రంజక బడ్జెట్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్ లో సంక్షేమ పథకాలకు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పించారని పేర్కొన్నారు.

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు 2025-26 బడ్జెట్ కంటే అదనంగా దాదాపు వెయ్యి కోట్లు ప్రతిపాదించి ఈసారి 2026-27 బడ్జెట్ లో 12511 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం రాగానే 48 గంటల్లో ఆర్టీసీ మహిళలకు వచ్చిన బస్సు ప్రయాణం ప్రారంభించామని మహిళలకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం బడ్జెట్ నిధులు కేటాయించిందన్నారు.202627 లో మహా లక్ష్మి పథకం కింద 4305 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. పేదలు ,బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా బడ్జెట్ లో కొత్త పథకాలు ప్రారంభించారని తెలిపారు.

**బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన నూతన పథకాలు**

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరి సంక్షేమం కొరకు సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, మధ్యతరగతి, ధనిక అని తేడా చూడకుండా రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకుప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల జీవిత బీమా అందించే విధంగా జూన్, 02, 2026 నుండి "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం" ను ప్రారంభించబోతుంది. ఈ పథకానికి బడ్జెట్ లో రూ.4,000 కోట్లు ప్రతిపాదించారు.

చాలా సంవత్సరాలు ఎదురు చూస్తున్న వృద్ధులకు , వికలాంగులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది.ఈ పథకం మొత్తానికి బడ్జెట్ లో రూ.14,861 కోట్లు ప్రతిపాదించారు. కొత్త పెన్షన్లు ప్రకటించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులకు వికలాంగులకు తదితరులు ఎంతో లబ్ధి చేకురుతుందని పొన్నం ప్రభాకర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఎంపిక చేసిన ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, డిజిటల్ సదుపాయాలు, ప్రత్యేక రవాణా వ్యవస్థలతో అన్ని వనరులతో కూడిన తెలగాణ పబ్లిక్ స్కూళ్ళు గా మార్పు చేయాలని బడ్జెట్లో ప్రతిపాదించారు. ఈ స్కూళ్ళలో ప్రీ ప్రైమరీ నుండి 12 వ తరగతి వరకు 1500 మంది విద్యార్థులకు విద్య అందించబడుతుందనీ ఈ పథకం మొత్తానికి బడ్జెట్ లో రూ.500 కోట్లు ప్రతిపాదించడం అభినందనీయమని జపాలన ప్రభుత్వం విద్య కు ప్రాధాన్యత కల్పిస్తుందని పేర్కొన్నారు.

2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించబోతుందని. ఈ బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులు పాలు మరియు మిగతా మూడు రోజులు రాగి జావ అందించనున్నారు. ఈ పథకం మొత్తానికి బడ్జెట్ లో రూ.800 కోట్లు ప్రతిపాదించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ అభ్యసిస్తున్న విద్యార్థులకు కూడా ఇకపై నూతనంగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్లు ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ పథకం మొత్తానికి బడ్జెట్ లో రూ.100 కోట్లు ప్రతిపాదించారూ. ఉద్యోగస్తులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ దాదాపు 23 లక్షల 51 వేల మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తాం. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 421 ఎంపానెల్ ప్రయివేట్ ఆసుపత్రులలో 1,998 వ్యాధులకు ఈ పథకం ద్వారా చికిత్సను పొందవచ్చు ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందించనుంది.ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలి సారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు.. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే 1 కోటి 20 లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తిస్తుంది, 60 ఏండ్ల వరకు 10 లక్షల రూపాయాల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాదంలో మరణిస్తే 2కోట్ల రూపాయలు అదనపుకవరేజి లభించే విధంగా ఈ పథకాన్ని రూపకల్పన చేశార ని ఈ పథకం 7 లక్షల 57 వేల ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు వర్తిస్తుంది. ఈ రెండు పథకాల మొత్తానికి బడ్జెట్ లో రూ.1,056 కోట్లు ప్రతిపాదించారు.

రాష్ట్ర యువతకు వివిధ రంగాలలో తగిన నైపుణ్య శిక్షణను మరియు వారికి ఉపాధి లభించిన ఆయా దేశాలకు సంబంధించిన భాషా జ్ఞానంలో శిక్షణ ఇప్పించడం, వారికివీసా మార్గదర్శకత మరియు విదేశీ ప్రయాణానికి కావలసిన రక్షణను ఇచ్చి విదేశాలలో ఆరోగ్య సేవలు, హస్పిటాలిటీ, నిర్మాణపు పనులు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం "సి.ఎం.ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం"ను ప్రారంభిస్తున్నట్లూ ప్రభుత్వం ప్రకటించింది.ఈ బడ్జెట్ లో సి.ఎం.ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం పథకానికి రూ.1,056 కోట్లు ప్రతిపాదించారు.బడ్జెట్ లో ఉద్యోగులకు ,బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడంపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ,డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కి మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



జనగామ, మన చౌరాస్తా : విద్యార్థులు చదువులో రాజీ పడొద్దని, ఎంచుకున్న లక్ష్యాల దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ స్పష్టం చేశారు. శుక్రవారం, జిల్లా కేంద్రంలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పాఠశాలలో కల్పిస్తోన్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అలాగే తరగతి గదులు, కంప్యూటర్ విద్య, విద్యార్థుల హాజరు వంటి అంశాలను పర్యవేక్షించి, పలు వివరాలను అడిగి తెలుసు కున్నారు. ముఖ్యంగా 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బోధన విధానం, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్ వంటి విషయాల్లో విద్యార్థుల ప్రగతిని పరీక్షించి, 9 వా తరగతి విద్యార్థులకు గణితంలోని పలు అంశాలపై సులభమైన పద్ధతి ద్వారా కలెక్టర్ విద్యార్థులకు బోధించారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా వార్షిక పరీక్షల దృష్ట్యా రివిజన్ (పునర్విమర్శ) తరగతులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. అదే విధంగా పాఠశాలలో పరిశుభ్రత, తాగునీటి వసతులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశమై బోధనలో నాణ్యత పెంచాలని, ప్రతి సబ్జెక్టులో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులకు గణితంలో మౌలిక అంశాలు (Mean, Median, Mode) పట్ల స్పష్టత కల్పించాలని, అలాగే పాఠశాలలో ఎన్సీసీ (NCC) కార్యక్రమాలు చేపట్టి, విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ పరిశీలనలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఇతర సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పీఎంఎంఎస్‌పై లబ్ధిదారుల ఎంపిక

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, PMMSY (ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన) పథకం కింద మోటార్ సైకిల్‌తో పాటు ఐస్ బాక్స్‌ల యూనిట్లను లబ్ధిదారులకు అందించేందుకు గాను జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి కమిటీ చైర్మన్ సందీప్ కుమార్ ఝూ ఎంపిక చేశారు. జిల్లాకు కేటాయించిన మొత్తం 13 యూనిట్లకు గాను 101 దరఖాస్తులు రాగా, వాటిలో 94 దరఖాస్తులు ఎంపిక కాగా, ఈ ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, జనరల్ (40 శాతం), మహిళలు (60 శాతం), ఎస్సీ, ఎస్టీ (60 శాతం) కోటా ప్రకారం జనరల్ కేటగిరీ నుంచి 8 మంది, ఎస్సీ కేటగిరీ నుంచి ఇద్దరు, ఎస్టీ కేటగిరీ నుంచి ఒకరు, మహిళా కేటగిరీ నుంచి ఇద్దరు లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరవేసే దిశగా కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా చేపల వ్యాపారంలో ఉన్న వారికి సౌకర్యవంతమైన రవాణా, నిల్వ సదుపాయం కల్పించి, వారి ఆదాయాన్ని పెంచడమే లక్ష్యం అని పేర్కొన్నారు. అదే విధంగా ఎంపికైన లబ్ధిదారులకు మే 8న వాహనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారి రాణా ప్రతాప్, డీఏఓ అంబికా సోనీ, జిల్లా ఫిషరీస్ చైర్మన్ నీల రాజు, ఇతర కమిటీ సభ్యులు, సొసైటీ సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# జనగామలో ఈ ఆఫీస్ వ్యవస్థ

- అధికారులు నిబద్ధతో పనిచేయాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ఈఆఫీస్ నిర్వహణ ద్వారా ఫైళ్ల పరిష్కారం పారదర్శకంగా, వేగవంతం అవుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పరిపాలనను ఆధునికీకరించి పనితీరులో జవాబుదారీతనాన్ని పెంచే విధంగా ఈ ఆఫీస్ నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కార్యాలయాల్లో పేపర్ వినియోగాన్ని తగ్గిస్తూ, ఫైళ్లను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ ఆఫీస్ అమలు ద్వారా ఫైళ్ల ప్రాసెసింగ్ వేగవంతమవుతుందని, నిర్ణయాలు త్వరితగతిన తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి శాఖలో ఈ విధానాన్ని సమర్థవంతంగా వినియోగించి, ప్రజలకు సేవలు మరింత మెరుగ్గా అందించాలని ఆదేశించారు. అలాగే అధికారులు, సిబ్బంది ఈ ఆఫీస్ వ్యవస్థపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అవసరమైన శిక్షణను పొందాలని కలెక్టర్ సూచించారు. ఫైళ్ల నిల్వ, ట్రాకింగ్ సులభతరం అవుతుందని, పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# సామాజిక అంశాలే కవుల ప్రాధాన్యం

జనగామ, మన చౌరాస్తా : సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని కవులు ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ఉందని సలాం జనగామ పుస్తక రచయిత సాంబరాజు యాదగిరి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (TSUTF) జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉగాది రాత్రి నిర్వహించిన సామాజిక కవి సమ్మేళనం పొట్టబత్తిని భాస్కర్ అధ్యక్షతన జరిగింది . ఈ కవి సమ్మేళనానికి ముఖ్య అతిధిగా హాజరైన యాదగిరి మాట్లాడుతూ సామాజిక కవి సమ్మేళనాన్ని ఒక సామాజిక స్పృహ కలిగిన TSUTF లాంటి ఉపాధ్యాయ సంఘం నిర్వహించడం సంతోషించదగిన విషయమని , సమాజ నిర్మాణంలో కవుల పాత్ర కీలకమని ,సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని రచనలు చెయ్యడం , పేద ,కార్మిక ,కర్షక వర్గాలకు అండగా ఉండేలా తమ కవితల ద్వారా ప్రభుత్వ ము మేల్కొనేలా చెయ్యడం ఉండాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ యుద్ధ మేఘాలు కమ్ముకున్నవేళ ,ప్రపంచ శాంతి ముఖ్యమని ,యుద్ధాలు మానవ వినాశనానికే తప్ప ,ప్రగతికి మార్గం కాదని ,కావున కవులు తమ రచనల ద్వారా సామ్రాజ్యవాదాన్ని ఎండగడుతూ , పేద , అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన వుంటూ ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. ఈ సమావేశంలో 32 మంది కవులు వివిధ సామాజిక అంశాల మీద రాసిన కవితలని వినిపించారు ,చాలా వరకు మధ్య ప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధాన్ని కవితా శీర్షికగా ఎంచుకుని రచనలు చేశారు. ఆ తదుపరి కవులందరిని TSUTF జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో TSUTF జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రావు, మదూరి వెంకటేష్ , ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ రాష్ట్ర డైరెక్టర్ ఆకుల శ్రీనివాస రావు, సాదిక్ ఫౌండేషన్ అధ్యక్షులు సాదిక్ , సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బూడిద గోపి, బాధ్యులు కనకయ్య, శ్రీనివాస్, రవీందర్, మహేష్ , అహ్మద్ పాషా, మోహన్ రావు, ప్రైమరీ స్కూల్ HM రాష్ట్ర బాధ్యులు బుర్ర రమేష్, SC, ST ఉపాధ్యాయ సంఘం బాధ్యులు షాధ రవి, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.



# కలెక్టర్ వేధింపులు ఆపాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొట్ల శేఖర్

**జనగామ, మన చౌరాస్తా :-** జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు డ్వాక్రా గ్రూపు మహిళలు పాలమాకుల చిన్న మంజుల పుత్కనూరి విజయలక్ష్మి కి టీ స్టాల్ మిల్క్ పార్లర్ శాంక్షన్ చేసిన సంగతి అందరికీ తెలిసిందే. గత పది రోజులుగా జనగామ జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ వీటిని తొలగించాలని ప్రోక్ క్రేన్లు జెసిపిలు రెవెన్యూ మున్సిపల్ పోలీస్ సిబ్బందితో భయభ్రాంతులకు గురిచేసి ఇబ్బందులు పెడుతుంటే దిక్కుతో తోచక బాధిత మహిళలు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఏప్రిల్ 4వ తారీఖు వరకు ఈకేసు విషయమై వాయిదా మధ్యంతర ఉత్తరం ఇవ్వడం జరిగింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను గౌరవించాల్సిన కలెక్టర్ బాధిత మహిళలపై వేధింపులకు వివిధ డిపార్ట్మెంట్లో అడ్డం పెట్టుకొని దాడులకు పాల్పడడం సరికాదు. సాధారణ డ్వాక్రా గ్రూపు మహిళల పట్ల కక్ష కట్టి కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులను అన్ని విభాగాల అధికారులను ఉసిగొల్పడం సరికాదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ బింకానికి పోకుండా పేద డ్వాక్రా గ్రూపు మహిళల పట్ల తనకున్న వైఖరిని మార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అజ్మీర సురేష్ నాయక్, జనగామ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు, జిల్లా నాయకులు తుంగ కౌశిక్ తదితరులు ఉన్నారు.





# ముల్కనూర్ ప్రీమియర్ లీగ్ 2026 టోర్నమెంట్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించనున్న "ముల్కనూర్ ప్రీమియర్ లీగ్ 2026" టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీగా నిర్వహిస్తున్న ఈ రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభంకానుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 24 జట్లు పాల్గొననున్నాయి. జట్లను నాలుగు గ్రూపులుగా విభజించి లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు ప్రకటించారు. మొదటి బహుమతిగా రూ.1,00,000, రెండో బహుమతిగా రూ.50,000, మూడో బహుమతిగా రూ.20,000, నాల్గో బహుమతిగా రూ.10,000 అందజేయనున్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనదలిచిన జట్లకు ఎంట్రీ ఫీజు రూ.10,000గా నిర్ణయించారు. నమోదు కోసం సుప్రీమ్ (9849978016), శ్రీకాంత్ (9951111890)లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీ ద్వారా యువ క్రికెటర్లకు తమ ప్రతిభను చాటుకునే మంచి అవకాశం లభిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. స్థానికంగా క్రీడా వాతావరణాన్ని పెంపొందించడంలో ఈ టోర్నమెంట్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

## వంగర పీహెచ్‌సీలో మెగా హెల్త్ క్యాంప్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ప్రజాపాలన-ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మెగా హెల్త్ క్యాంప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ క్యాంప్‌ను సర్పంచ్ సృజన రమేష్, ఉప సర్పంచ్ రమేష్ మరియు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి అప్పయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరవేయడం లక్ష్యంగా ఇలాంటి మెగా హెల్త్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, చిన్న చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ క్యాంప్‌లో ఎంజిఎం హాస్పిటల్ , సికేయం హాస్పిటల్ ల నుండి వచ్చిన నిపుణులైన వైద్యులు పాల్గొని సేవలు అందించారు. జనరల్ ఫిజీషియన్, పిల్లల వైద్యుడు (పెడియాట్రిషన్), ఎముకల నిపుణుడు (ఆర్థోపెడిషియన్), స్త్రీరోగ నిపుణురాలు (గైనకాలజిస్ట్)ల ద్వారా సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 147 మంది ప్రజలు ఈ ఆరోగ్య సేవలను వినియోగించుకోగా, ఆరోగ్య



పరిస్థితి దృష్ట్యా 28 మందిని మెరుగైన చికిత్స కోసం హయ్యర్ సెంటర్లకు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు డా. రహ్మాన్, డా. రుబీనా, డా. దినేష్, నర్సింగ్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ మెగా హెల్త్ క్యాంప్ ద్వారా గ్రామ ప్రజలకు నిపుణుల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అధికారులు ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు.

## చావుదార్ చెరువు పోరాటం చారిత్రాత్మకం

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** దళితుల తాగునీటి హక్కుల కోసం బి . ర్ . అంబేద్కర్ ఆధ్వర్యంలో జరిగిన మహాదేవ్ సత్యాగ్రహ దేశ చరిత్రలో అతి ముఖ్యమైన సామాజిక న్యాయ పోరాటంగా నిలిచిందని కౌన్సిలర్ గాదెపాక రవీందర్ పేర్కొన్నారు. చావుదార్ చెరువులోని నీటిని అన్ని వర్గాల ప్రజలు సమానంగా వినియోగించుకోవాలనే లక్ష్యంతో అంబేద్కర్ చేపట్టిన ఈ ఉద్యమం దళితుల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందని ఆయన అన్నారు. ఆయన మాట్లాడుతూ ఆ కాలంలో దళితులకు ప్రాథమిక హక్కులే లభించని పరిస్థితుల్లో తాగునీటి హక్కు కోసం చేసిన ఈ పోరాటం సామాజిక సమానత్వానికి బాటలు వేసిందని తెలిపారు. అంబేద్కర్ ఆలోచనలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, ప్రతి ఒక్కరూ సమానత్వ భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ప్రజాసంఘాల నాయకులు ముక్కెర సంపత్ కుమార్, కొయ్యడ కొమురయ్య, వెన్న రాజు, బోయిని రాజమల్లయ్య, గడిపె చిన్నబాలు, బుర్ర శ్రీనివాస్, భాస్కర్ నాయక్, ఆరె కిషోర్, బెజ్జంకి విశ్వనాథం, పొన్నాల వినోద్ కుమార్, కోతి దేవేందర్ తదితరులు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



## 22న దళిత హక్కుల పోరాట సమితి జిల్లా మహాసభ

భీమదేవరపల్లి, మన చౌరాస్తా : దళిత హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటానికి బలం చేకూర్చేందుకు మార్చి 22న నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా రెండవ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ పిలుపునిచ్చారు. ఈరోజు భీమదేవరపల్లి మండలంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న "అంబేద్కర్ హస్తం" పథకం కింద ప్రతి దళిత కుటుంబానికి ₹12 లక్షలు ఇస్తామని చెప్పినా, అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా ఆ అంశాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం బాధాకరమని తెలిపారు. అసెంబ్లీలో రిజర్వేషన్ల ద్వారా ఎన్నికైన దళిత ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ దళితులకు సరైన న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం బడ్జెట్‌లో కనీసం 20 శాతం నిధులను దళితుల కోసం కేటాయించాలని రాజ్యాంగం సూచించినప్పటికీ, కేటాయించిన నిధులను కూడా పూర్తిగా వినియోగించకుండా ఇతర శాఖలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో




"అంబేద్కర్ హస్తం" కింద ప్రతి కుటుంబానికి ₹12 లక్షలు అందేలా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇల్లు లేని వారిలో ఎక్కువ శాతం దళితులే ఉన్నారని, ఇందిరమ్మ ఇండ్లలో కనీసం 50 శాతం ఇళ్లను దళితులకు పారదర్శకంగా కేటాయించాలని కోరారు. ఈనెల 22న బాలసముద్రంలోని సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగే జిల్లా మహాసభకు మాజీ ఎమ్మెల్యే పోతరాజు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రి బిక్షపతి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా భీమదేవరపల్లి మండల కన్వీనర్‌గా చుంచు కుమారస్వామిని, కో కన్వీనర్‌గా కవ్వంపల్లి కిషన్‌ను నియమించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చుంచు కుమారస్వామి, కవ్వంపల్లి కిషన్, చిలుక శ్రీనివాస్, ఇల్లందుల దశరథం తదితరులు పాల్గొన్నారు.

## వీరన్నపేటలో రైతు మృతి

చేర్యాల, మన చౌరాస్తా : చేర్యాల మండలం వీరన్న పేట గ్రామంలో వ్యవసాయ పొలం గట్టు మీదినుంచి ప్రమాద వశాత్తూ జారిపడి రైతు మృతి చెందిన సంఘటన గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోకల రాజు (45) రోజువారీ పనుల నిమిత్తం వ్యవసాయ భావి వద్దకు వెళ్ళి వరి పొలాన్ని పరిశీలిస్తున్న క్రమంలో ప్రమాద వశాత్తూ గట్టు పైనుంచి పొలంలో జారి పడటంతో ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటన పైన కేసు నమోదు చేసుకున్న చేర్యాల పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఎస్సీ కార్పొరేషన్ 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈవి టూ వీలర్స్ ఈవి ఫోర్ వీలర్స్ కొరకు టీజీ ఓబి ఎంఎంఎస్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 24 చివరి తేదీ కావున మండలంలో ఉన్న ఎస్సీ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఎంపీడీవో వీరేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమ దరఖాస్తు లను ఈ డి ఎస్ సి కార్పొరేషన్ హనుమకొండ కార్యాలయంలో సమర్పించుటకు తెలియజేయుచున్నామని అన్నారు.



## 'ప్రెసెంటేషన్'లో రంజాన్ వేడుకలు

**చేర్యాల, మన చౌరాస్తా :** ప్రెసెంటేషన్ పాఠశాలలో రంజాన్ పర్వదినాన్ని అత్యంత ఆనందంగా, భక్తి భావంతో ఈ వేడుకలు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు రంజాన్ పండుగ యొక్క ప్రాముఖ్యతను వివరించే ప్రసంగములు ఇచ్చారు. ఉపవాసం, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలను రంజాన్ పండుగ మనకు నేర్పుతుందని ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి తెలిపారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ కలిసి సోదరభావాన్ని ప్రతిబింబించేలా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సామాజిక ఐక్యతను, పరస్పర గౌరవాన్ని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషించింది. ఈ వేడుకలు పాఠశాలలో ఆనంద వాతావరణాన్ని నింపాయి.

## 24న సోమన్న హుండీ లెక్కింపు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 24న మంగళవారం ఉదయం 10:30 గంటలకు హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆలయంలోని కళ్యాణ మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**